క్లుప్తంగా

తాళ్లపూడిలో భారీ వర్షం

కొవ్వూరు: డివిజన్‌లో తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం ఎనిమిది నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ తాళ్లపూడి మండలంలో గరిష్ఠంగా 44.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గోపాలపురం మండలంలో 20.2 మిల్లీమీటర్లు కురవగా, కొవ్వూరులో 14.6, నిడదవోలులో 142 మిల్లీ మీటర్ల చొప్పున కురిసింది. నల్లజర్ల, దేవరపల్లి, చాగల్లు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో ఓమోస్తరు నుంచి చెదురుమదురుగా చినుకులు పడ్డాయి.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.లక్ష

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆదివారం పోటెత్తారు. దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి, పూజలు నిర్వహించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. దర్శనాలు, వివిధ రూపాల్లో అమ్మవారికి రూ.1,00,645 ఆదాయం సమకూరింది. ఆలయ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గుబ్బాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలోని శ్రీ గుబ్బాలమ్మ వారి ఆలయ హుండీని మంగళవారం ఉదయం 10 గంటలకు తెరిచి, లెక్కించనున్నట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్ ఆదివారం తెలిపారు.

నేడు, రేపు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఉండ్రాజవరం: మండలంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు ఆదివారం తెలిపారు. ఈనెల 20న చివటంలో, 21న మోర్త గ్రామంలో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాల్లో సచివాలయం ద్వారా ఆధార్ సేవలు, ఆధార్‌తో మొబైల్ నంబర్ లింకేజీ, బయోమెట్రిక్, పుట్టినరోజు తేదీ మార్పు, ఆధార్ అప్డేట్ వంటివి చేస్తారన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


కాట్రాజు మృతదేహం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో అనాథ మృతదేహం దహన సంస్కారాలకు ఆ గ్రామానికి చెందిన మానవత సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించి, ఉదారతను చాటుకున్నారు. గ్రామంలోని యానాదుల కాలనీలో నివసిస్తున్న ఈగ కాట్రాజు (60) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందారు. ఆయన అనాథ కావడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మానవత సంస్థ సభ్యులు సాయన సుబ్బారావు, జమ్ముల శ్రీనివాసుల తక్షణం స్పందించి రూ. ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే రూ. 25 కేజీల బియ్యాన్ని కూడా అందజేశారు. దాంతో కాట్రాజు సామాజిక వర్గీయులైన బలుసు వీరయ్య, సూరన్న, అన్నవరం, చెరుకూరి సాయి, పల్లి కొండయ్య దహన సంస్కారాలు నిర్వహించారు.

గ్రామస్తుల ఖర్చుతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

చాగల్లు: నిడదవోలు–ఐ.పంగిడి రాష్ట్ర రహదారిపై ఊనగట్ల ప్రధాన కూడలిలో నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో గ్రామస్థులు అంతా కలిసి సెంటర్లో రూ.23 వేల ఖర్చుతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

నేడు పోలీసు స్టేషన్ వద్ద బహిరంగ వేలం

ద్వారకాతిరుమల: మండల పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 9 మోటారు సైకిళ్లకు స్థానిక పోలీస్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డులతో పాటలో పాల్గొనాలని కోరారు.

లేపాక్షిలో డిస్కౌంట్ సేల్


మేనేజర్ ఎ.కార్తిక్ కుమార్

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియంలో భారీ డిస్కౌంట్‌తో వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయని నగర మేనేజర్ ఎ.కార్తిక్ కుమార్ తెలిపారు. ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకూ భారీ డిస్కౌంట్లు ఇస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ డిస్కౌంట్ ఉంటుందన్నారు.

రక్తదాన శిబిరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో మెగాభిమానులు రక్తదానం చేశారు

భవిత పదిలం.. భద్రత పటిష్టం

- విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేలా ఏర్పాట్లు
- టెన్త్ ప్రశ్న పత్రంపై ఏడు అంకెల ప్రత్యేక కోడ్
- పరీక్ష కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ల సెల్‌ఫోన్లు కూడా నిషేధం
- పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీసులకు తావు లేకుండా చర్యలు
- ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీ చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణింపు


నిడదవోలులో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

నిడదవోలు రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకూ జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. మరోపక్క విద్యాశాఖ టెన్త్ పరీక్ష కేంద్రాలను పూర్తిస్థాయి భద్రతా నిలయాలుగా మారుస్తోంది. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఉండే విద్యార్థులు హాల్ టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. పరీక్ష నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది 2,942 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు.

మాల్ ప్రాక్టీసుకు వీలు లేకుండా..

పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఎంతో కష్టపడి చదువుతారు. తీరా పరీక్షకు హాజరయ్యే సమయంలో ఎక్కడో ఒక చోట ప్రశ్నాపత్రం లీకేజీ అయ్యిందంటూ వచ్చే వదంతులతో విద్యార్థులు ఎంతో ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది పేపర్ లీకేజీ సంఘటనలు చేటుచేసుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పరీక్ష కేంద్రాల్లోకి కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ మినహా, మరి ఏ ఇతర సామగ్రిని తీసుకువెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు పరీక్షల నిర్వహణలో కఠినంగా వ్యవహరించనుంది.

ప్రభుత్వోద్యోగులు, టీచర్లకే బాధ్యతలు

టెన్త్ పరీక్షల విధి నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు రూట్ అధికారులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకు రావడంపై నిషేధం విధించిన ప్రభుత్వం ఇకపై డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ల వద్ద సైతం సెల్ ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్న దృష్ట్యా విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు.

పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో పేపర్ లీకేజీ ఘటనల చోటుచేసుకున్న దృష్ట్యా విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. పరీక్ష కేంద్రానికి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకు రావద్దు. విద్యార్థులంతా కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.కిషోర్‌కుమార్, ఎంఈఓ, నిడదవోలు

కోడిపందేలు ఆడేవారికి కఠిన శిక్షలు విధించాలి

నల్లజర్ల: తెలికిచెర్ల శివార్లలో నిత్యం కోడి పందేల నిర్వహణ, వాటిపై పోలీసులు దాడులు చేసి పట్టుకోవడం పరిపాటిగా మారిందని తెలికిచర్ల పంచాయతీ సర్పంచ్ బండి చిన నాగరాజు(చిట్టి) అన్నారు. ఈ కోడి పందేల్లో తమ గ్రామస్తులు ఎవరూ పాల్గొనకపోయినా, తమ గ్రామంలో పందేలు నిర్వహించడం వల్ల గ్రామానికి చెడ్డపేరు వస్తోందని ఆయనన్నారు. కోడిపందేల కేసుల్లో అరెస్టయిన వారిని పోలీసులు కోర్టుకు హాజరు పరచడం, కోర్టు అపరాధ రుసుం విధించడం పరిపాటిగా మారిందన్నారు. గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకున్న బైక్‌లు,సెల్‌ఫోన్‌లు బయటకు వచ్చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలా కాకుండా పందేలు నిర్వహించే వారిని, ఆటగాళ్లను పట్టుకొని శిక్షలు తీవ్రంగా ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు కోరారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

చాగల్లు: దీర్ఘకాలంగా వైద్య,ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం చాగల్లులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పీవీ సత్యనారాయణ, కార్యదర్శులుగా నరసింహరాజు, విజయ రామకృష్ణ, జీఎస్ దుర్గాప్రసాద్, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు

వాలిన పొగాకు తోట.. రాలిన జీడి పూత


దేవరపల్లిలో కురుస్తున్న వర్షం


యర్నగూడెంలో వర్షానికి దెబ్బతిన్న పొగాకు తోట


ఉసులుమర్రులో పడిపోయిన వరి చేనును నిలబెట్టి కడుతున్న కూలీలు


అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో ఈదురు గాలులకు నేలవాలిన మొక్కజొన్న

దేవరపల్లి: అకాల వర్షాలకు మెట్ట ప్రాంత రైతులు అయోమయంలో పడ్డారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. ఉదయం కురిసిన భారీ వర్షానికి పొగాకు తోటల్లో నీరు నిలిచి పోవడంతో మొక్కలు వాలిపోయాయని రైతులు తెలిపారు. లేత తోటలకు వర్షాలు నష్టం తెచ్చాయని చెప్పారు. అలాగే వర్షాలకు జీడిమామిడి పూతలు దెబ్బతిన్నాయన్నారు. వర్షాల వల్ల పొగాకు, జీడిమామిడి, మిర్చి పంటలు ఎక్కువ నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

150 ఎకరాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న

నల్లజర్ల: ఆదివారం తెల్లవారుఝామున సంభవించిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలో వివిధ గ్రామాల్లోని దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంట నేలవాలినట్టు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కండెలు పాలుపోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న నేలవాలితే ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. మరికొన్నిచోట్ల కండెలు కోసి రోడ్లపై ఆరబెట్టారు. అవి కూడ తడిసి పోయాయి. బలంగా వీచిన ఈదురు గాలులకు మామిడితోటలలో పూత, పిందెలు నేలరాలాయి. వ్యవసాయాధికారి కమల్‌రాజ్ ఆదివారం సాయంత్రం మారెళ్ళమూడి, నల్లజర్ల, చీపురుగూడెం, నబీపేట, కృష్ణమ్మగూడెం గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల సాగుకు మాత్రం ఈ వర్షాలు కొంతమేర ఉపకరించాయి.

ఒరుగుతున్న వరి చేలు

పెరవలి: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రబీ వరి చేలు ఒరిగి పోతున్నాయి. ఇప్పటికే కూరగాయల పంటలైన దొండ, బెండ, ఆనబ, చిక్కుడు వంటి పాదులు పూత, పిందె రాలి పోయాయని రైతులు వాపోతున్నారు. వరి రైతుల పరిస్థితి మరోలా ఉంది. ప్రస్తుత వరి పైరు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. ప్రస్తుత వర్షాలకు వరిదుబ్బులు నేలను అంటడంతో రైతులు వాటిని కూలీల సాయంతో పైకి లేపి కట్టుకోవలసి వస్తోంది.ఇది తమకు అదనపు ఖర్చని వారు పేర్కొంటున్నారు. నేల నంటిన వరి చేలను అలాగే వదలేస్తే పంట కుళ్లి పోయే ప్రమాదం ఉంది. లేపి కడితే కొన్ని గింజలు చేతికి అందుతాయని వారు చెబుతున్నారు.

గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోండి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పాలంగిలో జగనన్న లేఅవుట్ పరిశీలన


పాలంగిలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు

ఉండ్రాజవరం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అధికారులకు సూచించారు. పాలంగి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. కాలనీలో జరుగుతున్న మట్టి పూడిక పనులను పరిశీలించి, అక్కడి నాయకులకు ఆయన పలు సూచనలు చేశారు. మట్టి పూడిక పనులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. అలాగే జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తామని లబ్ధిదారులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచులు బొక్క శ్రీనివాసు, మెండే వెంకట్రావు, శ్రీరామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్టోఫర్, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎమ్మెల్యే పరామర్శ

ఇటీవల గాయపడిన కె.సావరం గ్రామానికి చెందిన పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వర రావు, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బీసీ నాయకుడు కర్రెళ్ల శ్రీనివాసులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆదివారం పరామర్శించారు.

శ్రీవారి క్షేత్రంలో 'ఉగాది' కాంతులు


విద్యుద్దీప కాంతులీనుతున్న ఉగాది మండపం, పరిసరాలు

ద్వారకాతిరుమల: ఉగాది వేడుకలకు శ్రీవారి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. అందులో భాగంగా స్థానిక ఉగాది మండపం, పరిసరాలు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. మండపం ముందు భాగాన ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవారి విద్యుత్తు కటౌట్ చూపరులను ఆకట్టుకుంటోంది. ఈనెల 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు క్షేత్రంలో అట్టహాసంగా జరగనున్నాయి. ఆరోజు సాయంత్రం మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి, అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణాన్ని జరుపుతారు. అనంతరం పండిత సత్కారం, తీర్థ ప్రసాద పంపిణీ జరుగుతుందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ఉగాదిని ఘనంగా నిర్వహించాలి

నిడదవోలు రూరల్: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో గ్రామాల్లో ఘనంగా ఉగాది ఉత్సవాలు నిర్వహించాలని ఆ సంస్థ ఉత్తరాంధ్ర కార్యదర్శి భూపతిరాజు సుబ్బరాజు కోరారు. నిడదవోలులోని రామకృష్ణ సేవా సమితిలో విశ్వహిందూ పరిషత్ కొవ్వూరు జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మట్టపల్లి సుబ్బారాయుడు, మల్లెల కృష్ణమూర్తి, అచ్యుతరామయ్య, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీ పటిష్టానికి చర్యలు



సమిశ్రగూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న బొమ్ముల దత్తు

నిడదవోలు రూరల్: ప్రతి పోలింగ్‌బూత్‌కు పది మంది సభ్యుల చొప్పున నూతన కమిటీలు ఏర్పాటు చేసి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని గ్రామస్థాయిలో పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బండి సత్యనారాయణ అధ్యక్షతన నిడదవోలు పట్టణం, సమిశ్రగూడెం గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకుల సమావేశాలు నిర్వహించారు. నిడదవోలు మండల బీజేపీ అధ్యక్షుడిగా మాట్ల వెంకట దుర్గారావును నియమించినట్లు ఈ సందర్భంగా దత్తు ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు నీలం రామారావు, జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర, నాయకులు కె.మోహన్, ఎండీ మీరా, మోర్త సాయి, బీఆర్‌కేఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల కార్యవర్గ సమావేశం

ఉండ్రాజవరం: మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు కోరారు. మండలంలోని వేలివెన్ను గ్రామంలో ఆదివారం ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు సాయిరాం, నియోజకవర్గ సమన్వయకర్త బి.సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్షుడు బూరుగుపల్లి శివరామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా 80 మంది భక్తులు


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో పాదయాత్ర భక్తులు

ద్వారకాతిరుమల: మార్టేరు మండలం వనంపల్లిలోని లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం వద్ద ఈనెల 17న పాదయాత్ర చేపట్టిన 80 మంది భక్తులు ఆదివారం చిన వెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. దాదాపు 90 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసిన వీరంతా ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పాదయాత్ర నిర్వాహకులు తోలేటి రాంబాబు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, హిందూ మతాన్ని పెంపొందించడంతో పాటు, ప్రతి ఒక్కరిలోనూ భక్తి భావాలు కలిగించేందుకు ఈ పాదయాత్రను చేపట్టామన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామికి కంచి పీఠాధిపతి పూజలు


పార్వతీ సమేత ఉమారామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామీజీ

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిజీ శ్రీవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీఠంలో చంద్రమౌళీశ్వరస్వామి వారికి ఉదయం స్వామీజీ అభిషేకం చేశారు. అనంతరం విశేష పూజలు చేశారు. తిరిగి సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ స్వామీజీ పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామిజీని దర్శించుకుని, ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

పనస .. విరగ కాసె



ప్రతికూల పరిస్థితుల్లోనూ పనస చెట్టు విరగ కాసి, అబ్బుర పరుస్తోంది. ఏ చెట్టయినా సక్రమంగా పుష్పించాలన్నా, లేక కాయలు కాయాలన్నా రోజులో కనీసం ఆరు గంటల పాటు నిర్విరామంగా సూర్యరశ్మి కావాలి. కానీ నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయం మధ్య గల పనస చెట్టుకు ఆ అవకాశం లేదు. నాలుగు వైపులా భవనం ఉండడంతో రోజు మొత్తం మీద ఆ చెట్టుకు రెండు నుంచి మూడు గంటలకు మించి సూర్యరశ్మి లభించదు. అయినప్పటికీ ఆ వృక్షం మొదలు నుంచి కాండం వరకూ దాదాపు 80 కాయలు గుత్తులుగా కనిపిస్తున్నాయి. దీంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారంతా ఆసక్తిగా ఆ చెట్టును తిలకిస్తున్నారు. -నల్లజర్ల

గోటితో ఒలిచి.. తలంబ్రాలుగా మలచి


గోటి తలంబ్రాలను ఊరేగిస్తున్న శ్రీరామ సేవాసమితి సభ్యులు (ఫైల్)

నల్లజర్ల: మండలంలోని జగన్నాథపురానికి చెందిన భక్తులు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం చేశారు. గ్రామంలోని శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యాన నాలుగు భజన మండళ్ల సభ్యులు 60 మంది భక్తితో, శ్రీరామ నామ స్మరణతో నెల రోజులుగా గోటితో ధాన్యం ఒలిచి, 120 ప్యాకెట్లలో భద్రాద్రికి తలంబ్రాలు తీసుకువెళ్లనున్నారు. వెదుళ్ల రామకృష్ణ దంపతుల ఆధ్వర్యాన గత ఏడాది నుంచి వారు ఈ కార్యక్రమం చేపట్టారు. స్థానిక రామాలయం వద్ద మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో గ్రామం అంతా ఊరేగించి, జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యాన భద్రాచలం తీసుకువెళ్లే ఏర్పాటు చేస్తున్నామని హిందూ ధార్మిక మండలి సభ్యులు సవలం రామకృష్ణ, మైనం వెంకట బ్రహ్మయ్య, గన్నిన సుబ్బారావు, కొయ్యలమూడి నాగేశ్వరరావు తెలిపారు.